## క్లుప్తంగా

### డ్రైన్లలో వ్యర్థాల తొలగింపు



అల్లిపూడిలో కాలువలు శుభ్రం చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

**తుని రూరల్:** వరదనీటి ప్రవాహానికి అనువుగా మురుగు కాలువల్లో అడ్డుపడిన వ్యర్థాలను తొలగించే పనులను అధికారులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. మేజరు పంచాయతీ ఎస్.అన్నవరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శి మధుశేఖర్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు పర్యవేక్షణలో కార్మికులు వ్యర్థాలను తొలగించే పనులు చేపట్టారు. ఎస్.అన్నవరం కాలనీ, కొత్త సూరవరం, నూకాలమ్మ గుడి ఎదుట కాలనీ, కృష్ణనగర్ తదితర ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఆయా ప్రాంతాల్లో కాలువలను శుభ్రపర్చడం ద్వారా వరదనీరు దిగువకు పోయే మార్గాలు చేస్తున్నారు. అలాగే కొలిమేరు, వి.కొత్తూరు, లోవకొత్తూరు, దొండవాక, తేటగుంట గ్రామాల్లోనూ పారిశుధ్య పనులు చేపట్టారు.

**జోరుగా పారిశుధ్య పనులు**

**కోటనందూరు:** మండలంలోని అల్లిపూడిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. వర్షం తెరిపి ఇవ్వడంతో గ్రీన్ అంబాసిడర్లు కాలువలు, లోతట్టు ప్రాంతాల్లో నీటిని తొలగించి బ్లీచింగ్, దోమల నివారణ మందును పిచికారీ చేశారు.

### కులగణనకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

**ఏలేశ్వరం:** పట్టణ పరిధిలో చేపట్టనున్న కులగణనకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు కోరారు. ఈ నెల 9 నుంచి చేపట్టే కులగణనపై స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం కుల సంఘాల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో త్వరలో కులగణన ప్రారంభిస్తామన్నారు. అన్నివర్గాల ప్రజలు, కుల సంఘాల పెద్దలు సహకారం అందించాలని కోరారు. పలువురు కుల సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

### పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు



కేఓ మల్లవరంలో పూరిల్లుపై కూలిన తాటిచెట్టు

**తుని రూరల్:** మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు మండలంలో ఎనిమిది ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కొలిమేరు, కేఓ మల్లవరం, కొత్త సూరవరం గ్రామాల్లో ఇళ్లకు నష్టం వాటిల్లిందని తహసీల్దార్ ఎల్.శివకుమార్ తెలిపారు. కేఓ.మల్లవరంలో తాటాకు ఇంటిపై తాటి చెట్టు కుప్పకూలినప్పటికీ ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. పంపా రిజార్వాయర్ నుంచి అదనపు జలాలను దిగువకు విడుదల చేస్తే తేటగుంట శివారు గవరపేట గ్రామంలోకి వరదనీరు ప్రవేశించే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ఆ గ్రామస్తులను అప్రమత్తం చేసినట్టు తహసీల్దార్ తెలిపారు.

### వీరమ్మ చెరువు కాలువ పరిశీలన

**జగ్గంపేట:** స్థానిక పేకేటి వీరమ్మ చెరువుకు వెళ్లే కాలవలో నీటి ప్రవాహానికి అడ్డంకులను తొలగించేందుకు లైన్ ఎస్టిమేషన్ వేయించాలని జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య పంచాయతీ అధికారులను ఆదేశించారు. జగ్గంపేట పంచాయతీలో పేకేటి వీరమ్మ చెరువు కాలవను బుధవారం ఆమె పరిశీలించారు. కాలవ ఆక్రమణ, గతంలో రూ.32 లక్షలతో కట్టిన కట్టడాలు కొద్ది రోజులకే కాలవకు అడ్డంగా కూలిపోవడం, వాటిని తొలగించక పోవడం తదితర కారణాల వల్ల కలుగుతున్న ఇబ్బందులను జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బిందు మాధవి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీపీఓ భారతి సౌజన్య కాలువను పరిశీలించారు. ఆమెకు సచివాలయాల కన్వీనర్, గ్రామ ఉపసర్పంచ్ బండారు రాజా కాలవ పరిస్థితి, పంచాయతీ చేపట్టిన పనులను వివరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కొండలరావు, పంచాయతీ ఈఓ గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఒమ్మంగిలో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు



కొలిమేరులోని పొలంలో ముంపు నీరు పోయేందుకు బాటలు వేస్తున్న రైతులు



కేఓ మల్లవరంలో వరదనీటిలో మునిగిన వరిపనలు



సిరిపురంలో తడిసిన వరిపనలను పరిశీలిస్తున్న ఏఓ జ్యోతి

# ముంచెత్తిన వరద

- తుపాను ప్రభావంతో విస్తారంగా వర్షాలు
- నీట మునిగిన పంట పొలాలు
- రైతులకు అండగా నిలుస్తున్న అధికారులు



గాదెలపాలెంలో నీట మునిగిన వరి పంటను చూపుతున్న రైతు



రౌతులపూడి మండలం మల్లంపేట జంక్షన్ వద్ద చెరువును తలపిస్తున్న పంట పొలాలు

**తుని రూరల్:** మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వేలాది ఎకరాల్లో వరి, పత్తి, ఉద్యాన పంటలు నీట మునిగాయి. కోతకు సిద్ధంగా ఉన్న మూడు వేల ఎకరాల్లో వరిపైరు దెబ్బతిందని ఏఓ అశోక్ కుమార్ తెలిపారు. కుమ్మరిలోవ, కొలిమేరు, ఎస్.సూరవరం, డి.పోలవరం, తేటగుంట, టి.తిమ్మాపురం తదితర గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. రైతులకు సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు పంట నష్టం నమోదు చేస్తామన్నారు. పత్తి చేలు సైతం ముంపుబారిన పడ్డాయి. వందలాది ఎకరాల్లో ఉద్యాన పంటలైన కూరగాయలు, అరటి, కొబ్బరి, ఆయిల్‌పామ్ నీట మునిగాయి. కొలిమేరులో తాండవ నీరు సరఫరా అయ్యే కామినీడి కాలువ ఆక్రమణలకు గురికావడంతో పంట పొలాల్లోకి వరదనీరు చేరి తీవ్రంగా నష్టం కలుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చోద్రాజు రాంబాబురాజు, సర్పంచ్ అత్తి నాగరాజు రెవెన్యూ అధికారులతో కలసి గవరపేటలో పంట పొలాలను పరిశీలించారు. వీఆర్వోలు, వీపీఏలు, వీహెచ్‌ఏలు గ్రామాల్లో పర్యటించి పంట నష్టం అంచనా వేస్తున్నారు. వర్షపునీరు రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అనకాపల్లి జిల్లా కోటవురట్ల నుంచి కాకినాడ జిల్లా తుని మండలం కేఓ.మల్లవరం వైపు రాకపోకలకు నిలిచిపోయాయి.

**6,340 ఎకరాల్లో దెబ్బతిన్న పంట**

**తుని:** మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు తుని నియోజకవర్గంలోని 6,340 ఎకరాల్లో వరి పంట నీటి మునిగింది. ఇందులో 40 శాతం మేర వరి పంట పనలపై ఇంకా వరద నీటిలో ఉంది. వ్యవసాయశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులకు భరోసా కల్పించారు. తడిసిన ధాన్యాన్ని నేరుగా మిల్లులకు తరలించారు.

**నీట మునిగిన పల్లపు ప్రాంతాలు**

పట్టణంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు నీట మునిగాయి. సినిమా రోడ్డు, ఆంజనేయ స్వామి గుడి, పోస్టాఫీసు వీధి, వేంకటేశ్వర స్వామి గుడి తదితర ప్రాంతాల్లో వర్షం నీరు ఇళ్లల్లోకి చేరింది. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి ఆదేశాల మేరకు కమిషనర్ ప్రసాదరాజు అధికారులతో పర్యటించారు. నీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో శానిటేషన్ పనులు చేయించారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా తొండంగి మండలంలో పర్యటించి బాధితులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

**నీట మునిగిన వరిపంట**

**ఏలేశ్వరం:** తుపాన్ ప్రభావంతో మూడురోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు నియోజకవర్గవ్యాప్తంగా వరిపొలాలు ముంపునకు గురయ్యాయి. సుమారు 4 వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. రైతులు పంట ఒబ్బిడి పనుల్లో బిజీగా ఉన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, ఆర్బీకే సిబ్బంది పొలాల్లో పర్యటించి రైతులకు సూచనలు ఇస్తున్నారు. ఏలేశ్వరం మండలంలో సుమారు 800 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. మండల ఏఓ బి.జ్యోతితో పాటు ఆర్బీకే సిబ్బంది మండలంలోని ఏలేశ్వరం, లింగంపర్తి, సి.రాయవరం, తిరుమాలి, సిరిపురం తదితర గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. యర్రవరం, ఏలేశ్వరం, తిరుమాలి గ్రామాల్లోని అరటితోటలను ఉద్యానశాఖ అధికారి శ్రీవల్లి పరిశీలించారు. సుమారు 40 హెక్టార్లలో అరటి తోటలకు నష్టం జరిగినట్టు ఆమె తెలిపారు.

**పొంగి పొర్లిన ఊరకాలువ**

**గోకవరం:** మండల వ్యాప్తంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేని వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఏజెన్సీలో కురిసిన భారీ వర్షానికి ఊరకాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. కాలువ పొంగి పొర్లడంతో గోకవరం మురళీనగర్‌లో సోమాలమ్మ అనే మహిళ ఇల్లు దెబ్బతింది. బాధితురాలిని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి రమేష్, సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి తదితరులు పరామర్శించి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. గోకవరం శివారున పోలవరం నిర్వాసితుల కోసం నిర్మిస్తున్న దేవీపట్నం ఆర్ అండ్‌ఆర్ కాలనీ నీట మునిగింది. భారీ వర్షానికి మండలంలో సుమారు 192 ఎకరాల్లో వరి నీట మునిగింది. 469 ఎకరాల్లో వరి పంట నేలనంటింది. 450 మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోయింది. ఈ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు రైతులు చర్యలు చేపట్టారు. పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఏఓ రాజేశ్వరి పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

**కోటనందూరు:** మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వరిపొలాలు చెరువులను తలపిస్తున్నాయి. వేల ఎకరాల్లో పంట నీట మునిగింది. సుమారు 1840 ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. 500 ఎకరాల్లో వరిపనలు తడిచి మొలకెత్తుతున్నాయి. కాకరాపల్లిలో వెదుళ్లగెడ్డకు గండి పడింది. కొత్తకొట్టాంలో కండివాగు ఉధృతికి వందల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. నీట మునిగిన వరి పొలాలను, గండ్లు పడిన ప్రాంతాలను ఏపీబీ రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, మండల అధ్యక్షుడు సుర్ల రాజు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, తహసీల్దార్ కుశరాజు, ఏఓ చంద్రశేఖర్ సందర్శించి రైతులతో మాట్లాడారు. జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని భరోసా ఇచ్చారు. కాకరాపల్లి శివారు జిల్లా సరిహద్దు ప్రాంతంలో వెదుళ్లగెడ్డ బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించడంతో తుని-నర్సీపట్నం రోడ్డులో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిపై మంత్రి దాడిశెట్టి రాజా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడారు.

**రౌతులపూడి:** ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండలంలోని బలరామపురం, ఎ.మల్లవరం, ములగపూడి, గుమ్మరేగుల, పి.చామవరం, శృంగవరం, ఎం.చామవరం, పారుపాక, గిడజాం, లచ్చిరెడ్డిపాలెం, ఎస్ఎస్ పట్నం రాజవరం, గంగవరం, దిగువశివాడు,రాఘవపట్నం గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. తహసీల్దార్ బి.భీమారావు నేతృత్వంలో అధికారులు గ్రామాల్లో పర్యటించి నష్టాన్ని అంచనా వేశారు. మండల వ్యాప్తంగా 956 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

**రాకపోకలకు అంతరాయం**

భారీ వర్షాలకు రౌతులపూడి -కొట్టాం రహదారిపై మల్లంపేట జంక్షన్ వద్ద నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బలరామపురం-ఎ.మల్లవరం రహదారిలో దెయ్యాల మదుం వద్ద రోడ్డుపై నీరు ప్రవహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎం.చామవరం-పి.చామవరం, రాజవరం ప్రధాన రహదారిపై నీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు.



ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడిలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

**ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్:** తుపాను ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పంట పొలాలు నీట మునిగాయి. సుమారు 1400 హెక్టార్లలో వరి పంటకు, 32 హెక్టార్లలో అరటి, మామిడి తోటలకు నష్టం వాటిల్లినట్లుగా అధికారులు తెలిపారు. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వాగులు, వంకలు, గెడ్డలు పొంగి పొర్లాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లో తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, వ్యవసాయశాఖ జగ్గంపేట ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్ యింటి వీర గంగాధర్ తమ సిబ్బందితో పర్యటించారు. రైతులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

**గండేపల్లి:** మిచాంగ్ తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పంట పొలాలు నీట మునిగాయి. వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. నీలాద్రిరావుపేట, మల్లేపల్లి తదితర గ్రామాల్లో వర్షం నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నీలాద్రిరావుపేటలో జాలం కృపారావుకు చెందిన తాటాకిల్లు పూర్తిగా తడిసిపోవడంతో గోడ నేల కూలింది. యర్రంపాలెం, నాయకంపల్లి, సూరంపాలెం, యల్లమిల్లి, సింగరంపాలెం తదితర గ్రామాల్లో 265 ఎకరాల్లో వరి పంట నేలనంటింది. 421 ఎకరాల్లో పంట నీటమునిగింది. వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండలంలో 778 ఎకరాల్లో శనగ పంట దెబ్బతిన్నట్టు అధికారులు తెలిపారు.

**తొండంగి:** మండలంలోని ఎ.కొత్తపల్లి, బెండపూడి, గోపాలపట్నం, తొండంగి, శృంగవృక్షం, కొమ్మనాపల్లి, సీతారాంపురం, రావికంపాడు, కృష్ణాపురం, పైడికొండ ప్రాంతాల్లో దాదాపుగా 550 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యం, ఏఓ ఎస్.నరసింహం, వీఆర్వోలు, గ్రామసచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటనష్టాన్ని అంచనా వేస్తున్నారు. కుండపోత వర్షాలకు బెండపూడి, కోదాడ, గోపాలపట్నం, ఎ.కొత్తపల్లి, కృష్ణాపురం, కొమ్మనాపల్లి, పెరుమాళ్లపురం బుచ్చియ్యపేట తదితర గ్రామాల్లో శివారు కాలనీలు, పల్లపు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. బెండపూడి తారకరామా కాలనీ, గోపాలపట్నం ఎస్సీ కాలనీలో ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఇతర శాఖల అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

**ముంపు పొలాలను పరిశీలన**

**తొండంగి:** మండలంలోని ఎ.కొత్త పల్లిలో నీటమునిగిన పంట పొలాలను జిల్లా వ్యవసాయశాఖాధికారి విజయ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట తుని ఏడీఏ సుంకర బుల్లిబాబు, ఎంపీడీఓ వసపులేటి సతీష్, మండల వ్యవసాయ శాఖాధికారి ఎస్.నరసింహం, ఏఈవో కొప్పన దైవ ప్రసాద్ ఉన్నారు.

**శంఖవరం:** తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. మండల వ్యాప్తంగా ఈ ఏడాది సుమారు 15 వేల ఎకరాల్లో వరి, 500 ఎకరాల్లో పత్తి, 200 ఎకరాల్లో కూరగాయల సాగు చేశారు. వర్షాలకు పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

**కోటనందూరు:** మండలంలోని కాకరాపల్లిలో వెదుళ్ల గెడ్డకు పడిన గండిని, ముంపుకు గురైన పంట పొలాలను వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. జరిగిన నష్టంపై రైతులతో చర్చించారు. నష్టపోయిన రైతులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఏపీబీ డైరెక్టర్ లంక ప్రసాద్, ఏడీఏ బుల్లిబాబు, ఏఓ చంద్రశేఖర్, ఏఈఓ శివకుమారి పాల్గొన్నారు.



ఎ.కొత్తపల్లి ఆవలో రైతులతో మాట్లాడుతున్న జేడీఏ విజయ్‌కుమార్



కాకరాపల్లిలో వెదుళ్లగెడ్డకు పడిన గండి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు



తుని కట్రాళ్ల కొండ ఆనకట్టు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తాండవ నది



ఎం.చామవరం-పి.చామవరం గుర్రపు చెరువు వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న అధికారులు

# ప్రతి రైతునూ ఆదుకుంటాం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



గోకవరంలో తడిచిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

**గోకవరం:** తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గోకవరం మండలంలో వర్షం కారణంగా పంట దెబ్బతిన్న వరి పొలాలను బుధవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. మోకాళ్ల లోతు నీటిలోకి ఎమ్మెల్యే స్వయంగా దిగి నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. కళ్లాల్లో తడిచిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులెవ్వరూ అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా పంట నష్టం వివరాలను నమోదు చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్, వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. ఆయన వెంట సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, కర్రి శివరామకృష్ణ ఉన్నారు.

### బేషరతుగా ధాన్యం కొనుగోలు చేయాలి

**ప్రత్తిపాడు:** వర్షాలకు తడిసిన ధాన్యాన్ని బేషరతుగా ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని ప్రత్తిపాడు, టి.రాయవరం, రౌతుపాలెం గ్రామాల్లో నీట మునిగిన వరి పంటను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడంలో మిల్లర్లు మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. ధాన్యం కొనుగోలుకు వాహన సౌకర్యం లేకపోవడం, పండిన ధాన్యం నిల్వ చేసుకునేందుకు గిడ్డంగి సదుపాలయం లేకపోవడం, మిల్లర్లు సకాలంలో కొనుగోలు చేయకపోవడం వంటి కారణాలతో కళ్లాల్లో ధాన్యం తడిసిపోయిందని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే ప్రతి గింజనూ కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శింగిలిదేవి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపార వేత్త రామేశ్వరరావు కన్నుమూత



కుసుమంచి రామేశ్వరరావు భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి రాజా



మున్సిపల్ కౌన్సిల్ హాలులో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి, కౌన్సిలర్లు

**తుని:** ప్రముఖ వ్యాపార వేత్త, పట్టణ తొలి మున్సిపల్ వైస్ చైర్మన్, వర్తక సంఘం అధ్యక్షులు కుసుమంచి రామేశ్వరరావు (87) మంగళవారం రాత్రి తుది శ్వాస విడిచారు. స్థానిక రెడ్ కాన్వెంట్ వీధిలోని నివాసంలో బుధవారం ఆయన భౌతిక కాయాన్ని ఉంచారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా రామేశ్వరరావు భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామేశ్వరరావు మూడు సార్లు మున్సిపల్ వైస్ చైర్మన్‌గా, దీర్ఘకాలం వర్తక సంఘం అధ్యక్షుడిగా పని చేయడంతో పాటు రాజకీయంగా అజాత శత్రువుగా పేరు తెచ్చుకున్నారని మంత్రి రాజా అన్నారు. రామేశ్వరరావు కుమారులకు ధైర్యం చెప్పారు. తుని నియోజకవర్గంతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. రామేశ్వరరావు మృతికి సంతాపంగా తునిలో వ్యాపార సంస్థలకు తుని చాంబర్ ఆఫ్ కామర్స్ సెలవు ప్రకటించింది.

**కౌన్సిల్ ప్రత్యేక సమావేశం**

ప్రముఖ వ్యాపార వేత్త కుసుమంచి రామేశ్వరరావు ఆకస్మిక మృతి సందర్భంగా చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. తొలుత రామేశ్వరరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తొలి మున్సిపల్ వైస్ చైర్మన్‌గా రామేశ్వరరావు పని చేశారని చైర్‌పర్సన్ సుధారాణి, కౌన్సిల్ సభ్యులు కొనియాడారు. రాజకీయ కుటుంబం కావడంతో కోడలు కుసుమంచి శోభారాణి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, కుమారుడు ప్రస్తుతం తుని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. రామేశ్వరరావు మృతి తీరనిలోటని తీర్మానం చేశారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు, కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, జిల్లా వక్ఫ్‌బోర్డువైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కౌన్సిలర్లు సంతాపం వ్యక్తం చేశారు.

# అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

**గోకవరం:** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గోకవరంలో బుధవారం వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఎమ్మెల్యే చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ఠాణా సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసరి రమేష్, నరాలశెట్టి నర్శయ్య, రౌతు జోగేశ్వరరావు, కర్రి శివరామకృష్ణ, బిజ్జి రాజు, మచ్చా మోహన్, తోలేటి రాంప్రసాద్, బి.వీరచంద్రం తదితరులు పాల్గొన్నారు.

**ఆదర్శప్రాయుడు అంబేడ్కర్**

**రౌతులపూడి:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి తహసీల్దార్ బి.భీమారావు, ఎంపీడీఓ ఎం.గోవింద్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీటీ పీవీవీ సత్యనారాయణ, యూటీఎస్ అధ్యక్షుడు కె.హరిబాబు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**శంఖవరం:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి ఎంపీడీఓ జి.శివరామకృష్ణ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

**ప్రత్తిపాడు:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, ఈఓఆర్డీ కాశీ విశ్వనాథం, అన్నవరం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దోశ చిట్టిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పినిశెట్టి ప్రకాష్, మాజీ సర్పంచ్ దోశ నల్లబాబు పాల్గొన్నారు. స్థానిక 10వ వార్డులో అంబేడ్కర్ విగ్రహానికి జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి పూలమాల వేసి నివాళులర్పించారు.

**జగ్గంపేట:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జగ్గంపేట హాస్టల్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ కార్యదర్శి పులి ప్రసాద్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు.



గోకవరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

# జోరుగా మిల్లులకు ధాన్యం తరలింపు




ధాన్యం రాశుల్లో నీటిని తొలగిస్తున్న రైతులు

**జగ్గంపేట:** కష్టకాలంలో రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేస్తోంది. కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు రైతుల నుంచి ఆఫ్‌లైన్‌లో సేకరించి మిల్లులకు తరలిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఇప్పటి వరకూ సుమారు 700 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్ తెలిపారు. జగ్గంపేట శివారు సీతానగరం, కాట్రావులపల్లి గ్రామాల్లో రైతుల నుంచి బుధవారం ధాన్యం సేకరించామన్నారు. మండలంలో సుమారు 270 ఎకరాల్లో వరి పంట నేలనంటిందన్నారు. రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. తుపాన్ ప్రభావంతో నేలవాలిన పంటను రక్షించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధి కూలీల ద్వారా రైతులకు సహాయ సహకారాలు అందిస్తున్న తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు.